సమస్యల వలయంలో గురుకుల కళాశాల


పాలసానిపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల


గురుకులంలో చదువుకుంటున్న బాలికలు (ఫైల్)

- భయం భయంగా చదువులు
- శిథిలావస్థకు చేరిన పాలసానిపల్లి గురుకులం భవనాలు
- బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న విద్యార్థినులు, సిబ్బంది
- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం
- వందలాది విద్యార్థినుల భద్రతపై అధికారుల నిర్లక్ష్యం

భీమడోలు: పిల్లల భవిష్యత్తు బాగుండాలని ఆశించి ఇక్కడ చేర్పించాం. కాని ఇక్కడ పరిస్థితి చూస్తే భయమేస్తుంది ఓ తండ్రి ఆవేదన.. ప్రభుత్వం ఉచిత చదువు అంటుంది. కానీ ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో పిల్లల జీవితం ప్రమాదంలో పడుతుందని ఓ తల్లి ఆందోళన చెందుతుంది. మే నెల 30వ తేదీన పాలసానిపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలోని రెండు ల్యాబ్‌లకు చెందిన రెండు శ్లాబ్‌లు పేక మేడల్లా కూలిపోయాయి. అయితే వేసవి సెలవులు కావడం, రాత్రి పూట కూలడంతో పెను ప్రమాదమే తప్పింది. దీంతో ఈ నెల 12వ తేదీ నుంచి పునఃప్రారంభం అయిన తరగతుల నేపథ్యంలో భద్రత లేని పాఠశాలల్లో తమ పిల్లలను వదిలి ఎలా వెళతామని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యలను పరిష్కరించే విషయంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని తల్లిదండ్రులు, పెద్దలు అంటున్నారు. దీంతో గురుకులంలోని విద్యకు భద్రత లేకుండా పోయింది. కాలం చెల్లిన భవనాల్లో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న భయం వారిని వెంటాడుతోంది. గురుకులంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 710 మంది విద్యార్థినుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. టీచర్లు, కార్యాలయ సిబ్బంది, ఇతర సిబ్బందితో కలిసి 100 మందికి పైగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థకు చేరిన వంట శాల, భోజన శాల, డార్మిటరీల్లో శ్లాబ్‌లు ఊడి కింద పడుతున్నాయి. దీంతో భోజన శాల దుస్థితి అధ్వానంగా ఉండడంతో సరిగ్గా భోజనం చేయకుండానే తరగతి గదుల్లోకి వెళుతున్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న విద్యార్థినులు

ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతూ పతకాల పంట పండిస్తున్నారు. ఇక్కడ శారీరక, మానసిక ధారుఢ్యానికి చదువుతో పాటు క్రీడలు దోహదపడడంతో ప్రతి విద్యార్థిని తమకు నచ్చిన క్రీడల్లో రాణిస్తూ సత్తా చాటుతున్నారు. కానీ వారికి భద్రత కరువైంది. ఇటీవల ఈ గురుకుల కళాశాలను సందర్శించిన ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే వేసవిలో కనీస మరమ్మతులు చేపట్టలేదు.

బడ్జెట్ కేటాయింపులు ఏవీ?

ప్రతి ఏటా గురుకులాల్లో మౌలిక వసతులు, మరమ్మతులకు బడ్జెట్‌లో గురుకుల సొసైటీ ఉన్నతాధికారులు నిధులు కేటాయించడం లేదు. సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నా రని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణను వివరణ కోరగా భవనా ల్లోని పటుత్వాన్ని గుర్తించేందుకు సంబంధిత ఉన్నతాధికారులతో సంప్రదిస్తున్నాం. వారిచ్చే నివేదిక ను సొసైటీ ఉన్నతాధికారులకు సమర్పిస్తామని పేర్కొన్నారు. విద్యార్థినులకు మెరుగైన వసతుల కల్పనకు తమ వంతు కృషిచేస్తున్నామని తెలిపారు.

శిథిలావస్థకు చేరిన భవనాలు

జిల్లాలో నిర్మించిన బాలికల గురుకుల కళాశాలల్లో పోలసానిపల్లి గురుకుల కళాశాల మొట్ట మొదటిది. అప్పట్లో లోతట్టు ప్రాంతంలో నిర్మించడంతో వర్షపు నీరు ఆవరణలో నిలిచిపోవడం, అదే విధంగా భవన శ్లాబ్‌లపై పడిన వర్షపు నీరు కిందకు చేరే మార్గం లేక నిలిచిపోయి చెమ్మగిల్లి పటుత్వం కోల్పోతున్నాయి. ఈ క్రమంలో కొన్నిరోజుల ముందు రెండు ల్యాబ్‌లు కుప్పకూలిపోయాయి. వేసవి సెలవులు కావడంతో పెను ప్రమాదం తప్పింది. మెయిన్ కారిడార్‌లోని ల్యాబ్‌లు శిథిలావస్థకు చేరి కూలిపోవడంతో అటుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది వెళ్లాలంటేనే భీతిల్లిపోతున్నారు. అదే విధంగా కళాశాలలోని వంట శాల, భోజన శాల, కార్యాలయం, సిబ్బంది ఆవాసాలు ఉండే భవనాలు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయం వారిని పట్టిపీడస్తుంది. గురుకులం చుట్టూ చిట్టడవి తలపిస్తుంది. విష సర్పాలు సంచరిస్తున్నాయి. ఇక్కడ వాటర్, మరుగుదొడ్ల సమస్య ఉంది.


కూలిన శ్లాబ్‌లు (ఫైల్)


వర్షపు చెమ్మతో శ్లాబ్ నుంచి పెచ్చులూడుతున్న భోజనశాల

క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ 12 పుస్తకాలు చొప్పన అందజేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఎంపీసీ గ్రూపులకు ఇంగ్లిష్, తెలుగు మీడియం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

గర్భిణులకు పీఎం సురక్ష మాతృత్వ అభియాన్


గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

దెందులూరు: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, వ్యాయామం చేయాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పోతునూరు వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ, సురక్షిత ప్రసవం తల్లీబిడ్డ క్షేమం లక్ష్యంగా పీఎం సురక్ష మాతృత్వ అభియాన్ పథకం అమలు చేస్తుందన్నారు. సిబ్బంది ఈపథకంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. గర్భిణులకు ఎంపీహెచ్‌ఓ ప్రభాకర్, సూపర్‌వైజర్ హరి, వైద్య సిబ్బంది పలు సూచనలు చేశారు.

ట్రస్ట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ


విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

దెందులూరు: ప్రతిభ ఉంటే ఏదైనా సాధ్యమని వడ్లపట్ల కస్తూరి మాత చారిటబుల్ ట్రస్ట్ అధినేత వడ్లపట్ల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కొవ్వలిలో వారి నివాసంలో పదో తరగ తి పరీక్షల్లో స్కూల్ టాపర్లుగా నిలిచిన బీద లోహిత్ కుమారుకు రూ.9 వేలు, పెండెం ధర్మతేజకు రూ.8వేలు, చాట్ల సుధీర్‌కు రూ.5 వేలు, పర్వతనేని శ్యామ్‌కు రూ.8 వేలు యూఎస్‌ఏకు చెందిన దాత వడ్లపట్ల రామచంద్ అందజేశా రు. కార్యక్రమంలో కొవ్వలి, దెందులూరు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు జీఎస్‌ఎల్‌ఎన్ వీ శర్మ, వడపట్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందిస్తున్న హెచ్‌ఎం జ్యోతిషర్మిల

భీమడోలు: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యలో ముందుండాలని భీమడోలు మోడల్ ప్రైమరీ స్కూలు నంబర్-4 ప్రధానోపాధ్యాయులు జ్యోతిషర్మిల అన్నారు. శుక్రవారం పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను విద్యా కమిటీ చైర్మన్ నేదూరి పార్వతితో కలిసి 54 మంది బాల బాలికలకు అందజేశారు. మూడు జతల యూనిఫామ్, పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జ్యోతి షర్మిల మాట్లాడుతూ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఉత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను నిష్ణాతులైన ఉపాధ్యాయులచే అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీచర్లు ఎం.శరీన్, కె.పరమానందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలని ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సన్నబియ్యంతో వండిన భోజనం, ఇతర పదార్థాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. పాఠశాలకు హాజరయ్యే విద్యార్థులంతా ఖచ్చితంగా భోజనం చేసేలా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. పాఠశాల, వంట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎండీఎం నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 ఈదుపల్లి శ్రీనివాసరావు, హెచ్‌ఎం శేష పద్మజ, టీచర్ అహ్మద్, ఎండీఎం నిర్వాహకులు పాల్గొన్నారు.

16 నుంచి వ్యాయామ కళాశాల తరగతులు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల తరగతులు ఈ నెల 16 సోమవారం నుంచి ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియల్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ కళాశాల నుంచి విద్యార్థులకు ఈ మేరకు సమాచారం అందించామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు: భీమడోలు సెక్షన్‌లోని గుండుగొలను సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 14వ తేదీ శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శివాజీ శుక్రవారం తెలిపారు. గుండుగొలను ఫీడర్ల పరిధిలోని గుండుగొలనుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన తెలిపారు.

రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్య


రైల్వే గేటు వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

ఉంగుటూరు: ఉంగుటూరు రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. రోజు రోజుకూ ట్రాఫిక్ ఎక్కువ అవుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ లోపు వెళ్లి వచ్చే రైళ్ల రద్దీ, సైరన్ల మోతతో పడరాని పాట్లు పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. శుక్రవారం నాలుగు సార్లు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఐస్ పరిశ్రమలకు వెళ్లే చేపల లోడు లారీలు, కంకర లారీల రద్దీతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వే, జాతీయ రహదారుల అధికారులు ఆర్‌వోబీని మంజూరు చేశారు. అయితే నిర్మాణం జరిగే వరకు ఈ ట్రాఫిక్ సమస్య తప్పదని ప్రయాణికులు వాపోతున్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ఉంగుటూరు: మండల కేంద్రంలో యోగాపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. నంబర్-1 పాఠశాల విద్యార్థులతో కలిపి ర్యాలీలో ఉపాధ్యాయులు, ఆయుష్ డిపార్టుమెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు. యోగా-జయ జయ యోగా అనే నినాదాలు చేశారు. ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి (ఆయుష్) డాక్టర్ డి.శంకర్ ప్రసాద్, ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లేశ్వరి, యోగా మాస్టర్ ట్రైనర్లు మంద జయలక్ష్మి, పీవీ పెద్దిరాజు, మెటర్నరీ అసిస్టెంట్ పి.కృష్ణకుమారి, కాలి మంగన్న, దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అన్ని సచివాలయాల్లో యోగ శిక్షణ

దెందులూరు: మండలంలోని అన్ని సచివాలయాల్లో శనివారం యోగ శిక్షణ నిర్వహిస్తారని ఎంపీడీవో కె.శ్రీదేవి తెలిపారు. గ్రామ సచివాలయాల కార్యదర్శులు, యోగా ట్రైనర్లు సమన్వయంతో శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సూచించారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి


మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెదపాడు: వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టి, మలాథియాన్ స్ప్రే చేయాలని పీహెచ్‌సీ అధికారి డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండలంలోని ప్రతి హాస్టల్‌లో విద్యార్థులు దోమలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫ్రైడే డ్రై డే, మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మలేరియా అధికారి జె.గోవిందరావు, ఆరోగ్య విస్తరణాధికారి కృష్ణారావు, హనుమంతు ఆరోగ్య కార్యకర్త సాయికుమారి పాల్గొన్నారు.

విచ్చలవిడిగా చెట్ల నరికివేత


విచ్చలవిడిగా నరికివేసిన చెట్లు

భీమడోలు: మండలంలో పలు గ్రామాల్లో చెట్ల నరికివేత యథేచ్ఛగా సాగుతోంది. కొన్ని గ్రామాల్లో అభివృద్ధి పేరుతో వాటిని నరికేస్తున్నారు. కొన్ని చోట్ల వ్యాపారులకు అడ్డుగా ఉండడంతో వాటిని నరికేస్తున్నారు. చెట్లను సంరక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరించడంతో వాటిని నరికి రాత్రికి రాత్రే ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. భీమడోలు, పూళ్ల నుంచి ఎంఎం పురం, హైవే వెంబడి చెట్లు నరికేస్తున్నారు. ప్రతి ఏటా జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నాం. మొక్కలు నాటండి.. వాటిని సంరక్షించండని ఊకదంపుడు ప్రసంగాలు ఇస్తున్న అధికారులు, పాలకులకు చెట్లు నరికేస్తున్న ఘటనలు కనిపించడం లేదా అని పర్యావరణ ప్రేమికులు విమర్శిస్తున్నారు. ఈ విధంగా చెట్లను నరికి వేస్తే జీవకోటి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎం పురం గ్రామానికి త్రీఫేజ్ కరెంట్ మంజూరైన నేపథ్యంలో ఎంఎంపురం గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాల్లో ఒక వైపు ఉన్న చెట్లను సంబంధిత అధికారుల అనుమతితోనే తొలగించారు. దీంతో ఆ రహదారి బోసిపోయింది.

చెట్ల నరికివేతతో మోళ్లు మిగిలాయి

మండుటెండలో ప్రజలు, రైతులకు చల్లని నీడ, గాలిని అందించిన చెట్లను నరికి వేయడంతో మోళ్లు మిగిలాయి. విద్యుత్ అధికారులు రైతులు ఆక్రమించుకున్న స్థలాల్లో స్తంభాలను ఏర్పాటు చేసినట్లయితే వృక్షాలను నరకాల్సిన అవసరం వచ్చేది కాదని గ్రామస్తులు చెబుతున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు వెళ్లే దారిలో రోడ్డుకు ఓ వైపు వృక్షాలను నరికి వేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో వాటిని రాత్రికి రాత్రే ట్రాక్టర్‌పై తరలించారు. ఇలాగే ఇష్టానురాజ్యంగా చెట్లను నరికి వేస్తే భవిష్యత్తు తరాలకు సహజ వనరులు లభ్యం కాక గాలి కూడా కరువవుతుందని పర్యావరణ వేత్తలు గగ్గోలు పెడుతున్నారు. చెట్లను నరికినంతగా మొక్కలు పెంచకపోవడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా చెట్లను నరికి వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ప్రకృతిని నాశనం చేయకుండా మన భవిష్యత్తును రక్షించుకునే దిశగా అడుగులు వేయాలని పలువురు కోరుతున్నారు. నరికిన చెట్ల స్థానంలో మూడు రెట్ల మొక్కలు నాటాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకర మలుపులు.. మృత్యు మార్గాలు

- మండల పరిధిలో 17 మలుపులు.. తరచూ ప్రమాదాలు
- జిల్లాలో ప్రధాన రోడ్డుగా చేబ్రోలు-ఉండి ఆర్అండ్‌బీ రహదారి


నారాయణపురం ఐస్ ఫ్యాక్టరీల వద్ద ఉన్న మలుపు

ఉంగుటూరు: జిల్లాలో ప్రధాన రహదారుల్లో ఒకటిగా మారిన ఉండి-చేబ్రోలు ఆర్‌అండ్‌బీ రహదారి మలుపుల మయంగా ఉంది. పెరిగిన రద్దీ విపరీతమైన స్పీడుతో నడిచే వాహనాల నేపథ్యంలో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఉంగుటూరు మండలం సీతారామపురం నుంచి గొల్లగూడెం శివారు వరకు ఈ ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరించి ఉంది. సుమారు 20 కిలో మీటర్ల మేర 17 ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఇవన్నీ ప్రమాద సూచికలుగా ఉన్నాయి. వెను వెంటనే రెండు, మూడు మలుపులు కొన్ని చోట్ల ఉన్నాయి. రాచూరు నుంచి రావులపర్రు, తోకలపల్లి కోడు మధ్యలో నాలుగు మలుపులు ఉన్నాయి. అలాగే రావులపర్రు నుంచి నారాయణపురం చేరే లోపు ఏడు మలుపులు ఉన్నాయి. నారాయణపురం నుంచి గొల్లగూడెం చేరే లోపు పది మలుపులు ఉన్నాయి. ఈ మలుపులను దాటుకొని ప్రయాణం చేయడం గగనంగా మారింది. పూర్వం ఇసుక పుంత రహదారిగా ఉన్న ఈ రోడ్డును చింతలపాటి మూర్తిరాజు ఎమ్మెల్యేగా ఉండగా తారు రోడ్డు నిర్మించారు. ఆ సమయంలో డెల్టా ప్రాంత పశువులను మెట్ట ప్రాంతాలకు ఈ రహదారి గుండా తరలించేవారు. అలాగే గడ్డి బళ్లు, ఇతర రవాణాకు రైతులు ఈ రహదారిని ఉపయోగించే వారు.

ప్రధాన రహదారిగా మారిన వైనం

పెరిగిన వాహనాల రద్దీ దృష్ట్యా డెల్టాకు, మెట్ట ప్రాంత గ్రామాలకు ప్రధాన రహదారిగా మారిపోయింది. భీమవరం-జంగారెడ్డిగూడెం పట్టణాలకు ప్రధాన రహదారి అయ్యింది. ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. వందలాది లారీలు తిరుగుతున్నాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు వేలాదిగా నడుస్తున్నాయి. ఆక్వా రంగానికి చెందిన వందలాది లారీలు ఈ రహదారి మీదుగా నడుస్తున్నాయి. ఏ మాత్రం వేమరపాటు తనంతో ఈ రహదారిలో వాహనం నడిపినా ప్రమాదానికి గురైనట్లే. ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఎంతో మంతి ప్రాణాలు కోల్పోయారు. ఎంతో మంది క్షతగాత్రులయ్యారు. ఇంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ ఆర్‌అండ్‌బీ రహదారికి పొంచి ఉన్న మలుపులు సరి చేయాల్సిన అవసరం పాలకులపై ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న దాఖలాలు లేవు. ప్రజల పట్ల మృత్యు పాశాలుగా ఉన్న మలుపులు తొలగించి రహదారి కనిపించేలా సరి చేయాలని పాలకులను వేడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఈ రహదారి మీదుగా వెళుతుంటారు. రాచూరు వద్ద ఆయన స్వయంగా ఎర్కొన్న ట్రాఫిక్ సమస్య దృష్ట్యా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వాటి మీద ఆర్‌అండ్‌బీ అధికారులు రాచూరు మలుపుల వద్ద రమదారి విస్తరణకు ప్రతిపాదన ప్రభుత్వానికి పంపారు. ఈ మలుపులు ఎప్పటికి తొలగిస్తారో వేచి చూద్దాం.

మలుపులను తొలగించాలి

ఉంగుటూరు మండలంలో ఉన్న ఈ ఆర్‌అండ్‌బీ రహదారిలో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. ఇన్ని మలుపులు జిల్లాలో ఏ రహదారిలో లేవు. ఈ మలుపులు తొలగించాలి. ఈ మలుపులవలన ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు నివారించేందుకు హెచ్చరిక బోర్డులు పెట్టాలి. ప్రధానంగా మలుపులు తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. ఈ ప్రయత్నం చేసి మలుపుల దారిని మంచి రహదారిగా మార్చాలి.

– బండారు నాగరాజు, ఎంపీటీసీ, నారాయణపురం


రాచూరు గ్రామంలో ఉన్న ప్రమాదకర మలుపు


తోకలపల్లి ముురుగు కోడు వద్ద ఇలా..

వయో వృద్ధులకు ప్రత్యేక చట్టాలు

పెదపాడు: వయో వృద్ధుల సంక్షేమం, పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు చేసిందని సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ తెలిపారు. ఏలూరులోని కొప్పుల వెలమ కల్యాణ మండపంలో ప్రపంచ వయో వృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలను వివరించారు. వీటిని ప్రజలకు వివరించేందుకు ప్రభుత్వం దేశ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో లీగల్ సెల్ సలహాలు అందిస్తారని చెప్పారు. తదుపరి వయో వృద్ధుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాది రత్నరాజు మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని, దీనిపై ప్రభుత్వం చట్టం చేసినట్లు తెలిపారు.

నూతన ఎస్సై బాధ్యతల స్వీకరణ

చింతలపూడి: చింతలపూడి ఎస్సైగా కె.సతీష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన టి.నరసాపురం, తడికలపూడి, ద్వారకాతిరుమల, గోపాలపురం పోలీస్ స్టేషన్లలో ఎస్సైగా పని చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కుటుంబరావు స్థానంలో సతీష్‌కుమార్ బదిలీపై వచ్చారు.